



కొవిడ్‌ను కట్టడి చేసేలా..!

జిల్లాలో తొలి కేసు నమోదుతో అప్రమత్తమైన వైద్యాధికారులు

రుయా, స్విమ్స్‌లో పరీక్షా కేంద్రాలు, ఐసీయూ పడకలు సిద్ధం



తిరుపతి(వైద్యం), జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి కొవిడ్ కేసు నమోదుతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ వ్యాప్తి చెందినా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు కొత్తగా ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లలో కొవిడ్ వ్యాపిస్తున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు కేసులు రాగా.. అందులో జిల్లాలో పది నెలల చిన్నారి ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై కొవిడ్ కట్టడి దిశగా సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా స్విమ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డులో ఆరు వెంటిలేటర్ పడకలతోపాటు మరో పది ఆక్సిజన్ పడకలను సిద్ధం చేశారు. 22 టన్నుల సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంటు స్విమ్స్‌లో ఉండటం వల్ల భవిష్యత్తులో ఆక్సిజన్‌కు ఎటువంటి ఇబ్బంది రాదని వైద్యాధికారులు చెప్పారు. ఆర్టీపీసీఆర్, రాపిడ్ కిట్లు కూడా సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక, రుయాస్పత్రిలోని ప్రత్యేక కొవిడ్ వార్డులో 40 ఐసీయూ పడకలను అధికారులు సిద్ధం చేశారు. మూడు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రసూతి ఆస్పత్రిలోనూ గర్భిణుల కోసం ప్రత్యేక కొవిడ్ వార్డును సిద్ధం చేయడంతో పాటు సిబ్బందినీ నియమించారు. అలాగే 3కేఎల్, 6కేఎల్ సామర్థ్యం కలిగిన రెండు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. కొవిడ్ ఏ దశలో వచ్చినా సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధమైనట్లు అధికారులు చెబుతున్నారు.

కొవిడ్ బారిన పడిన చిన్నారిని తీసుకెళ్లిన తల్లిదండ్రులు

రుయా చిన్నపిల్లల విభాగంలో కొవిడ్ బారిన పడి చికిత్స పొందుతున్న పది నెలల చిన్నారిని తల్లిదండ్రులు సిబ్బందికి తెలియకుండా బుధవారం తీసుకెళ్లి పోయారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ప్రాంతానికి చెందిన ఈ చిన్నారికి సోమవారం స్విమ్స్‌లో నిర్వహించిన ఆర్టీపీసీఆర్ పరీక్షలో కొవిడ్ పాజిటివ్ వచ్చింది. దీంతో మంగళవారం నుంచి ఆ చిన్నారిని రుయా చిన్నపిల్లల విభాగంలో ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తుండగా, తల్లిదండ్రులు తీసుకెళ్లిపోయారు. ఈ విషయం తెలిసి బుధవారం వైద్యులు, వైద్య సిబ్బంది ఆస్పత్రి పరిసరాల్లో వెతికినా వారి జాడ తెలియరాలేదు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎటువంటి భయం అవసరం లేదని చిన్నపిల్లల విభాగం వైద్యులు పేర్కొన్నారు.

పీహెచ్‌సీల్లోనూ రాపిడ్ పరీక్షలు



స్విమ్స్, రుయాస్పత్రిలో కొవిడ్ పరీక్ష కేంద్రాలున్నా అవసరాన్ని బట్టి పీహెచ్‌సీల్లో కూడా రాపిడ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రజలూ కొవిడ్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని చెప్పాం. ఏ వేరియంట్‌లో కొవిడ్ వచ్చినా ఎదుర్కొనేందుకు అవసరమైన మందులు, వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే మొదట్లోనే కొవిడ్‌ను పూర్తిగా కట్టడి చేసే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో

గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి



రద్దీ ప్రాంతాల్లో తిరగకపోవడం గర్భిణులకు మంచిది. అలాగే ఒంట్లో నలతగా ఉన్నా, జ్వరం, ఎక్కువ రోజులు జలుబు వంటివి ఉన్నా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. రక్తహీనతతో బాధపడే గర్భిణులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా కొవిడ్ నిబంధనలు పాటించాలి.

- డాక్టర్ పార్థసారథిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి

చిన్నారుల పట్ల జాగ్రత్త



చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చిన్నారుల్లో చిన్నపాటి దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య సలహాలు తీసుకోవాలి. సొంతంగా మందులు వాడటం మంచిది కాదు. నెలలు నిండని చిన్నారుల విషయంలో మరీ జాగ్రత్తలు పాటించాలి. వీరిని వీలైనంత వరకు బయటకు తీసుకురాకపోవడం ఉత్తమం. చిన్నారుల తల్లిదండ్రులూ బయట తిరిగేసమయంలో కొవిడ్ నిబంధనలు పాటించడం మంచిది.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయాస్పత్రి

ఏఆర్ కానిస్టేబుల్ డిస్మిస్

మరో రిజర్వు హెడ్ కానిస్టేబుల్ కూడా అరెస్టు

హైదరాబాదు డ్రగ్స్ కేసు పర్యవసానం


రామచంద్ర

తిరుపతి(నేరవిభాగం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు డ్రగ్స్ కేసులో ఏ1 నిందితుడైన తిరుపతి ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్‌ను డిస్మిస్ చేస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే కేసులో ఇతడితోపాటు తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పూజారి రామచంద్ర కూడా నిందితుడు. వీరిద్దరినీ బుధవారం తిరుపతిలో కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేయడంతో పోలీసు వర్గాల్లో సంచలనం కలిగించింది. శాంతిభద్రతలను కాపాడాల్సిన విధుల్లో ఉండే వీరిద్దరూ డ్రగ్స్ సరఫరాలో కీలకంగా ఉండటం జిల్లాలో సంచలనం కలిగించింది. కేవీపల్లెకు చెందిన రామచంద్ర తిరుపతిలోని శ్రీకృష్ణనగర్‌లో నివాసం ఉంటున్నాడు. గుణశేఖర్‌లాగే ఇతడి పనితీరుపైనా ఆరోపణలున్నాయి. గతంలో రైల్వేలో పనిచేస్తుండగా డిస్మిస్ కావడమే నిదర్శనం. మూడు రోజుల కిందట హైదరాబాదుకు చెందిన ఎస్‌ఓటీ పోలీసులు ఒక దాబాపై దాడులు చేసి అక్కడ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న క్రమంలో ఈ మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, కానిస్టేబుల్ గుణశేఖర్ కొంత కాలంగా మంచి మిత్రులని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. గతంలో రైల్వేలో పనిచేస్తూ సర్వీసు నుంచి డిస్మిస్ అయిన రామచంద్ర.. 1991లో రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా చేరి.. ఇప్పుడు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. పదేళ్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో క్యాష్ ఆర్డర్లీ విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడి విధి నిర్వహణ పట్ల గతంలో పలు ఆరోపణలు, విమర్శలు వచ్చినా వివిధ డ్యూటీల నిమిత్తం జిల్లా పోలీసు కార్యాలయానికి అధికారులు పంపడం గమనార్హం. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన ఓ అధికారికి ఇతడు అత్యంత సన్నిహితంగా ఉండటమే దీనికి కారణమన్న విమర్శలున్నాయి. మరోవైపు వీరిద్దరూ కొంత కాలంగా జిల్లా పోలీసు శాఖకు చెందిన అత్యంత రహస్య సమాచారాన్ని కొందరు వైసీపీ నాయకులకు చేరవేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వీరిద్దరు కొంత కాలంగా గంజాయితో పాటు నార్కోటిక్ డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి తెప్పించి ఒంగోలు, గుంటూరు మీదుగా హైదరాబాదుకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో పాటు హైదరాబాదు పోలీసుల విచారణలో విస్తుగొలిపే విషయాలు వెల్లడించినట్లు తెలిసింది.

కూటమి సంబరాలు

రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన అద్భుతంగా ఉందని.. రాక్షస రాజ్యం నుంచి విముక్తి లభించిందంటూ బుధవారం కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఇక, పార్టీ ఆదేశాలతో వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినం పేరిట నిరసన చేపట్టాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి నివాసం వద్ద బాణసంచా పేలుస్తున్న జనసేన శ్రేణులు

ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలో సంబరాలు జరపాలని టీడీపీ ఎలాంటి పిలుపూ ఇవ్వలేదు. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో నేతలు ఎలాంటి వేడుకలూ జరపలేదు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి వంటి చోట్ల మాత్రం నేతలు, శ్రేణులూ హంగామా చేశారు. తిరుపతిలో అలిపిరి పాదాల మండపం వద్ద ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. టౌన్ క్లబ్ కూడలిలో టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ నేతృత్వంలో ఎన్టీయార్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. చంద్రగిరి టవర్ క్లాక్ సెంటర్‌లో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ, డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి ఎన్టీఆర్ కూడలిలో టీడీపీ కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకోగా.. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. నాయుడుపేటలో సామాన్య టీడీపీ కార్యకర్త ఒకరు పేదలకు అన్నదానం చేశారు.

● ఇక, జనసేన అధిష్ఠానం పిలుపుతో పలుచోట్ల పార్టీ శ్రేణులు రోడ్డుపైకి వచ్చాయి. తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్టీవీ నగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సాయంత్రం ఎమ్మెల్యే నివాసం వద్ద దీపాలు వెలిగించి, బాణసంచా పేల్చారు. సూళ్ళూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోనూ జనసేన నాయకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. బీజేపీ మాత్రం సంబరాలకు దూరంగా ఉంది.



సత్యనారాయణపురం సర్కిల్ నుంచి ర్యాలీగా వస్తున్న వైసీపీ శ్రేణులు

వైసీపీ వెన్నుపోటు దినం

తిరుపతి సత్యనారాయణపురం కూడలి నుంచీ మున్సిపల్ పార్కు వరకూ వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినం పేరిట ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయానికి వెళ్ళి టీడీపీ కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ వినతిపత్రం అందజేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, పార్టీ ఇంఛార్జి అభినయ్ తదితరులు పాల్గొన్నారు. చంద్రగిరిలో ఇంఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో టవర్ క్లాక్ సెంటర్ నుంచీ వైసీపీ శ్రేణులు తహసిల్దారు కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాయుడుపేటలో జరిగిన నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య.. గూడూరులో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, శ్రేణులు పాల్గొన్నారు. అధికారం కోల్పోయాక తొలిసారి వైసీపీ శ్రేణులు రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు చేపట్టినా మునుపటి జోష్ కనిపించలేదు.

చంద్రగిరి కోటలో యోగా



చంద్రగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర ప్రచారంలో భాగంగా బుధవారం చంద్రగిరి కోటలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. గత నెల 21 నుంచి ఈనెల 21 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు యోగాపై ప్రజలకు శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే జిల్లావ్యాప్తంగా సుమారుగా 8 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యాన్ని యోగ ద్వారా అందరికీ తెలియజేయడం, తద్వారా పర్యాటకం గురించి తెలిసేలాగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం కాపాడుకోవచ్చని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. చంద్రగిరి కోటలో యోగాంధ్ర నిర్వహించడం వల్ల పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో రామ్మోహన్, ఏపీ టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, పర్యాటక శాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, అధికారులు, నేతలు, స్థానికులు పాల్గొన్నారు.







పోలీసులే తోబుట్టువులై..!

● మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం చేసిన సహచర సిబ్బంది

తడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆమెకు అన్నదమ్ముల్లేరు. ఆ లోటును భర్తీ చేస్తూ సహచర కానిస్టేబుళ్లే తోబుట్టువులయ్యారు. పోలీసు స్టేషన్‌లో ఆమెకు సీమంతం చేశారు. తమలోని మానవతను చాటారు. ఈ ఘటన బుధవారం తడ పోలీసు స్టేషనులో జరిగింది. తడలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.ప్రమీల స్వగ్రామం నెల్లూరుజిల్లా మనుబోలు. సూళ్లూరుపేట అత్తగారి ఇల్లు. తల్లిదండ్రులు తప్ప అన్నదమ్ముల్లేరు. పెళ్లయిన పదేళ్ల తర్వాత ఆమె తొలిసారి గర్భవతి అయ్యారు. ఇటీవలే 9 నెలలు నిండి కాన్పుకు వెళ్లేందుకు ప్రసూతి సెలవు పెట్టుకున్నారు. మహిళా కానిస్టేబుల్ అయిన ఆమె కూడా ఆడబిడ్డే. తోడపుట్టిన అన్నదమ్ములు లేరని, శ్రీమంతం చేసుకోవాలని ఉన్నా ఆ యోగం తనకు లేదంటూ మనస్సులోనే బాధ పడేవారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ కొండపనాయుడు, సిబ్బంది ఆ ఆడపడుచుకు సోదరులయ్యారు. బుధవారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లోనే ఆమెకు శ్రీమంతం జరిపించారు. దీంతో ప్రమీల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సొంత అన్నదమ్ముల్లా సీమంతం జరిపిన తోటి సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

9 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేణిగుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని విద్యుత్ ఉప కేంద్రంలో 100 వాట్ల నుంచి 160కి.. 360 వాట్ల నుంచి 420 వాట్లకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచే పనులను గురువారం నుంచి 9వ తేదీ వరకు చేపడుతున్నారు. ఈ పనులు జరిగేటప్పుడు అత్యవసర సమయంలో కరెంటు సరఫరా ఆపనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ(ఆపరేషన్స్) శ్రీనివాసన్ తెలిపారు. దీంతో 9వ తేది వరకు రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


యోగాలో పాల్గొన్న విద్యాశాఖ సిబ్బంది

భాకరాపేట, జూన్ 4(ఆంధ్ర జ్యోతి): యోగాతో మానసిక ఒత్తిడి దూరం చేసుకో వచ్చునని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ తరపున యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది మనస్సు, శరీరం, ఆత్మలను సమన్వయం చేస్తుందన్నారు. శారీరక సంకోచం, చక్కటి శరీ రాకృతి కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కైలాసధామం నిర్మాణానికి విరాళం


నానికి చెక్కు అందజేస్తున్న రాకేష్

చంద్రగిరి, జూన్ 4(ఆంధ్ర జ్యోతి): చంద్రగిరిలో స్వర్ణముఖి నది ఒడ్డున ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మ కంగా నిర్మిస్తున్న కైలాస ధామం నిర్మాణానికి బుచ్చినా యుడుపల్లెకు చెందిన ఆర్‌జే వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ దామరపాటి రాకేష్ రూ.1,16,000 చెక్కును విరాళంగా ఇచ్చారు. విరాళాన్ని ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆయన బుధవారం అందజేశారు. ఈసందర్భగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ అందరికి ఉపయోగపడే కైలాసధామం నిర్మాణానికి విరాళం ఇవ్వడం అభినందీయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవినాయుడు, మాజీ సర్పంచ్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

మామండూరు తుడా లేఔట్ పరిశీలన


లేఔట్‌ను పరిశీలిస్తున్న తుడా చైర్మన్ డాలర్స్ దివాకరరెడ్డి,అధికారులు

చంద్రగిరి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మామం డూరులోని తుడా లేఅవుట్‌ను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం అధికారులతో కలిసి పరిశీ లించారు. అక్కడ కల్పిం చాల్సిన సౌకర్యాలపై చర్చిం చారు. ఇప్పటికే డ్రైనేజీ, కరెంటు, సీసీ రోడ్లు సౌక ర్యాలు కల్పించామని అధికారులు తెలిపారు. ఈలేఔట్ లో 135 ప్లాట్లకుగాను 12 మాత్రమే మిగిలి ఉన్నాయని వివరించారు. త్వరలో నీటి సౌకర్యం కల్పించాలని దివాకర్ రెడ్డి సూచించారు. గవర్నమెంట్ అప్రూవల్ రాగానే మిగిలిన 12 ప్లాట్లకు కూడా వేలం నిర్వహించాలన్నారు తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూప రింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ సుజన, ప్లానింగ్ ఆఫీసర్ దేవీ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'బూటకపు మ్యానిఫెస్టోతో టీడీపీ వంచన'


తహసీల్దార్‌కి వినతిపత్రాన్ని ఇస్తున్న మోహిత్‌రెడ్డి, నాయకులు

చంద్రగిరి, జూన్4(ఆంధ్ర జ్యోతి): సూపర్ సిక్స్ పథకాలంటూ మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విమర్శించారు. వెన్నుపోటుదినం కార్యక్రమంలో భాగంగా చంద్రగిరిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టవర్ క్లాక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, తహసీల్దార్ శివరామసు బ్బయ్యకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ బూటకపు మ్యానిఫెస్టోతో అధికారంలోకి వచ్చి తర్వాత అమలు చేయడానికి ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ కబుర్లు చెబుతున్నారన్నారు. ఎమ్మెల్యే నాని హయాంలో సామాన్య ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. కార్యక్రమంలో మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర



రామచంద్రాపురం, జూన్ 4(ఆంధ్ర జ్యోతి): అనుపల్లె గ్రామంలో బుధవారం గంగ జాతర వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి ఘట్టం కుండ మేళతాళాల నడుమ ఇంటింటా పూజలందుకుంది. గంగమ్మ ప్రతిమను మట్టితో తయారు చేశారు. బంగారు ఆభరణాలతో శోభాయమనంగా అలంకరించారు. రజకుల ఇంటి నుంచి గంగమ్మ మేళతాళాల నడుమ వీధుల్లో ఊరేగారు. ఈసందర్భంగా గ్రామస్థులు పొంగళ్లుపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారంమధ్యాహ్నం గ్రామ బలి కార్యక్రమం జరిగింది. అమ్మవారిని తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి దర్శించుకున్నారు.

కూటమి ప్రభుత్వ విజయోత్సవం


చెర్లోపల్లె సర్కిల్‌లో జరిగిన సంబరాల్లో టీడీపీ నాయకులు

తిరుపతి రూరల్, జూన్4(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె సర్కిల్‌లో వద్ద కూటమి ప్రభుత్వ మొదటిఏడాది విజయోత్సవాన్ని బుధవారం ఆ పార్టీల శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. తుమ్మలగుంటలో టీడీపీ సీనియర్ నాయకులు బిరుదాల కృష్ణారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, అయ్యప్ప కేక్‌కట్ చేశారు.

వరసిద్ధుడి సేవలో టీటీడీ సీవీఎస్వో


టీటీడీ సీఎస్వోకి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో తెలంగాణవాసి అదృశ్యం


వడ్డే మద్దిలేటి

తిరుమల, జూన్4(ఆంధ్ర జ్యోతి): తిరుమలకు వచ్చిన ఓ తెలంగాణవాసి కనిపించకుండాపోయాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. గద్వాల జిల్లా,పెద్దపోతులపాడుకు చెందిన వడ్డే మద్దిలేటి(52) తన భార్య లక్ష్మీదేవి, మరో తొమ్మిదిమంది గ్రామస్థులతో కలిసి గత నెల 28న తిరుమలకు వచ్చారు. అదేరోజు రాత్రి క్యూలైన్ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 7వ కంపార్టుమెంట్‌లోకి ప్రవేశించారు. రాత్రి 11.26 గంటల సమయంలో దర్శనానికి గేట్లు తెరిచిన క్రమంలో మద్దిలేటి కనిపించకుండా పోయాడు. తిరుమలలో పాటు తిరుపతి, రేణిగుంటలో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలిసిన వారు 0877 2289027, 94407 96771 నంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

టీటీడీ డీఈకి స్వల్పగాయాలు


ప్రమాదానికి గురైన డీఈ కారు

తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో టీటీడీ ఎలక్ట్రికల్ డీఈ స్వల్పంగా గాయపడ్డారు. బుధవారం ఘాట్‌రోడ్డులోని చివరి మలుపు(జీఎన్‌సీ సమీపం) వద్ద ముందు వెళుతున్న తమిళనాడు వాహనాన్ని డీఈ చంద్రశేఖర్ ప్రయాణిస్తున్న టీటీడీ కారు ఢీకొంది. ఈ క్రమంలో కారులో ఉన్న డీఈ,డ్రైవర్లకు స్వల్ప గాయాలయయ్యాయి. వారిని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

యూనివర్సిటీల్లో అభివృద్ధి ఇలా..!

● వర్సిటీ అధికారుల సమావేశంలో ఎస్వీయూ, పద్మావతి అధికారుల నివేదన



సమావేశంలో పాల్గొన్న ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీలను ఈ విధంగా అభివృద్ధి చేస్తున్నామంటూ ఆయా యూనివర్సిటీల అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. విజయవాడలో ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ బుధవారం నిర్వహించిన యూనివర్సిటీ అధికారుల సమావేశంలో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు. ఇటీవల యూనివర్సిటీల్లోని పరిణామాలు, కొత్త కార్యక్రమాలు, కొత్త లక్ష్యాలను వారు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి వివరించారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అభివృద్ధిని ప్రామాణికంగా, వేగవంతంగా చేపట్టడం ద్వారా ప్రపంచ స్థాయి ర్యాంకులను యూనివర్సిటీలు సొంతం చేసుకోవాలని ఉన్నత విద్యామండలి అధికారులు సూచించారు.

బంగారమ్మకు సారె సమర్పణ

శ్రీకాళహస్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో కొలువై ఉన్న బంగారమ్మ ఆలయంలో జాతరను పురస్కరించుకుని బుధవారం ఎమ్మె ల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ సారెను అందజేశారు. పూజల అనంతరం బంగారమ్మను పట్టువస్త్రాలతో విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనా యుడు, పట్టణ ప్రముఖులు తదితరులు పా ల్గొన్నారు. అంతకుముందు అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు కుంభం వేశారు. 6గంటలకు బంగారమ్మ ఉత్సవమూర్తిని పట్టణంలో ఊరేగించి రాత్రి నిమజ్జనం చేశారు. కాగా ఈ ఊరేగింపులో ఎమ్మెల్యే సుధీర్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా ఈ భవనాలు


గ్రామ సచివాలయం ముందు ఖాళీ మద్యం సీసాలు

చంద్రగిరి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొన్ని ప్రభుత్వ భవనాలను అసాంఘిక శక్తులు అడ్డాగా మార్చుకుంటున్నారు. నిర్మాణాలు పూర్తయినా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాని భవనాలను తమకు అనువుగా ఉపయోగించుకుంటున్నారు. చంద్రగిరిలోని నూకలగుంట సమీపంలో గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హాల్, రిసెప్షన్ సెంటర్, మరో భవనం నిర్మించారు. ఈప్రాంతంలో జనసంచారం పెద్దగా ఉండదు.దీంతో కొందరు అకతాయిల తమ ఇష్టానుసార కార్యక్రమాలకు ఈ భవనాలను వాడుకుంటున్నారు. ఒక్క రైతు భరోసా కేంద్రం తప్ప మిగిలిన భవనాలేవీ వినియోగంలోకి రాలేదు. ఇవి మద్యం బాబులకు కేరాఫ్‌గా మారుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఇందులో మద్యం తాగుతున్నారు. ఖాళీ సీసాలు, కాల్చేసిన సిగరెట్లను ఆభవనాల్లో పడేస్తున్నారు. రైతు భరోసా కేంద్రం కిటికీ అద్దాలను కూడా ఆకతాయిలు పగలగొట్టారు. సాయంత్రమైతే ఇక్కడికి మందుబాబులు చేరుకుంటున్నారు. మద్యం తాగుతూ గొడవలు పడుతూ అసౌకర్యం కలిగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటుగా వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నామంటున్నారు. అధికారులు స్పందించి ఆభవనాలు వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ భవనాల సమీపంలో పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.




కార్యాలయం భవనంపై మద్యం సీసాలు- ఆర్‌బీకే కిటికీ అద్దం పగిలిపోయిన దృశం-వినియోగంలో లేక, తెరిచి ఉన్న కమ్యూనిటీ హాల్

అందరినీ వంచించి వెన్నుపోటు దినమా?

వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే నాని ఆగ్రహం

చంద్రగిరి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సైకో పాలన నుంచి విముక్తి పొందిన రోజు కనుకే ప్రజలు సంబరాలు చేసుకొంటున్నారని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. టీడీపీ గెలిచి ఏడాదైన సందర్భంగా బుధవారం చంద్రగిరిలో కూటమి నాయకులు, కార్యకర్తలు స్థానిక టవర్ క్లాక్ వద్ద పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు తమ సైకో పాలనను మరచి వెన్నుపోటు దినం అంటున్నారని విమర్శించారు. అన్నిరంగాలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన నాయకుడెవరో ప్రజలకు తెలుసన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, నాయకులు బాలకృష్ణమూర్తి, విశ్వనాథం, వెంకటముని, బీజేపీ, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రాపురం:** మండలకేంద్రంలో టీడీపీ నాయకులు భారీ కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, జనార్దనచౌదరి, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, డిల్లీనాథరెడ్డి, మునెయ్య, ముద్దుకృష్ణారెడ్డి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, మదనమోహన్, శివకుమార్, ఆర్వీ రమణారెడ్డి, మోహన్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



చంద్రగిరిలో ఎమ్మెల్యే పులివర్తి నాని- రామచంద్రపురంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేస్తున్న దృశ్యం

గజదాడిలో రైతు దుర్మరణం


గణపతి మృతదేహం

ఐరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో ఓ రైతు దుర్మరణం చెందాడు. ఐరాల మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని నాగమవాండ్లపల్లె భజనబండ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. బుధవారం వేకువ జామున ఐదు ఏనుగుల గుంపు నాగమవాండ్లపల్లెలోని పొలాలపై దాడి చేశాయి. మామిడి, చెరకు, వరి పంటలతోపాటు రాతి కూసాలు, కంచెను ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో గోవిందరెడ్డిపల్లెకు చెందిన ఓ రైతు మామిడి తోటపై పడ్డాయి. సమీపంలోనే రైతు సూరిమాని గణపతి(60), మునీశ్వరి దంపతులు తమ తోట వద్ద నిద్రిస్తున్నారు. ఏనుగుల ఘీంకారానికి వారు నిద్రలేచారు. భార్యను అక్కడున్న గదిలోనే ఉండమని చెప్పి ఏనుగులను తరమడానికి గణపతి ఒక్కడే వెళ్లాడు. ఓ ఏనుగు ఆయనపై దాడి చేయడంతో తల పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏనుగుల అలజడి తగ్గాక గ్రామంలోని రైతులు పొలాల వద్దకు చేరుకున్నారు. అక్కడ గణపతి మృతదేహం కనిపించడంతో కుటుంబీకులకు, పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు.గణపతి మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

రూ.10లక్షల పరిహారం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10లక్షల పరిహారాన్ని ప్రకటించినట్లు గణపతి కుటుంబీకులకు ఎమ్మెల్యే మురళీమోహన్, డీఎఫ్‌వో భరణి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం బాధితులకు రూ.5లక్షల చెక్కును అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు మణినాయుడు, లత, రాజేష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, పురుషోత్తం, కోదండయాదవ్ పాల్గొన్నారు.

నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు

చిత్తూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గంలోనూ పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ అమలవుతోంది. తాజాగా ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త అనే నిర్ణయాత్మక విధానాన్ని సీఎం చంద్రబాబు తెరపైకి తెచ్చారు. ఇప్పుడు ఈ విధానంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పారిశ్రామికపార్కును అభివృద్ధి చేయాలని పరిశ్రమలు- వాణిజ్యశాఖ చేసిన ప్రతిపాదనను బుధవారం కేబినెట్ ఆమోదించింది. ఈ లెక్కన జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఏడు పార్కులు అభివృద్ధి కానున్నాయి. జీడీనెల్లూరు నియోజకవర్గంలో దీనికి సంబంధం లేకుండా చిత్తూరు- తచ్చూరు నేషనల్ హైవేను దృష్టిలో పెట్టుకుని రెండు వేల ఎకరాలను సేకరించాలని ఆ మధ్య పర్యటించిన ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం కుప్పం నియోజకవర్గంలో అమలు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునరుద్ధరించనున్నారు. ఇక్కడి ప్రజల కోసం క్లస్టర్ ఆధారిత విధానంలో 15 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటుచేయనున్నారు. రూ.8.22 కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పంపిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. ఈ మొత్తాన్ని వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద మంజూరు చేయనున్నారు. ఆయా ప్లాంట్లను మరమ్మతులు చేసి అక్టోబరు నుంచి సుజల పథకాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయి. దీనివల్ల 2.85 లక్షల మందికి పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

వేద వర్సిటీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

● దరఖాస్తుకు ఈనెల 10 చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు),జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.సమ గ్ర సమాచారం కోసం.. వేదిక్ యూనివర్సిటీ.. పేర గల వెబ్‌సైట్ చూడాలని ఆ వర్సిటీ పీఆర్వో డాక్టర్ బ్రహ్మాచార్యులు కోరారు.

వాగ్దానాల అమలులో విఫలం

వెన్నుపోటు దినం ర్యాలీలో భూమన కరుణాకరరెడ్డి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న కరుణాకరరెడ్డి తదితరులు

తిరుపతి (జీవకోన), జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విఫలమయ్యారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలోని సత్యనారాయణపురం సర్కిల్ నుంచి తిరుమల బైపాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష ప్రసంగించారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, ఉదయ్, వంశీ, వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవో రామ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు.

ర్యాలీలో భాగంగా వైసీపీ శ్రేణులు ఇష్టానుసారంగా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చొరవ తీసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు.

జన సమీకరణకు తిప్పలు

వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ఎలాగైనా విజయవంతం చేయాలన్న ఉద్దేశంతో జన సమీకరణకు వైసీపీ నాయకులు తిప్పలు పడ్డారు. జనం ఎవరూ స్వచ్ఛందంగా రాకపోవడంతో గంట ర్యాలీ కోసం రూ.100 నుంచి రూ.200వరకు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది.

అభినయ్ రెడ్డికి చేదు అనుభవం

ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన అనంతరం మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. ఓ మహిళ అక్కడికి వచ్చి తమ ఇంటిని తొలగించి రోడ్డు వేశారని, అయితే ఇప్పటివరకు టీడీఆర్ బాండ్లు రాలేదని, తమ వద్ద సంతకాలు కూడా తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటివరకు డబ్బు ఇవ్వలేదని, న్యాయం చేయాలని నిలదీసింది. దీంతో మీడియా వారు అక్కడికి చేరుకోవడంతో వైసీపీ శ్రేణులు ఆమెను పక్కకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో అభినయ్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు విజయగోపాలపురం దగ్గర అదుపు తప్పిన స్కూటర్ ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు... కాటూరుకు చెందిన ఆకాష్, విష్ణు, చందు బుధవారం బీఎన్‌కండ్రిగ నుంచి కాటూరుకు స్కూటర్‌లో వెళ్తున్నారు. విజయగోపాల పురం వద్ద రోడ్డు పక్కన పైపులైను పనులు జరుగుతుండడం, ఎక్స్‌కవేటర్, క్రేన్ ఉండటంతో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గుర్తించ కుండా అదుపు తప్పి ఢీకొన్నారు. ఈ ఘటనలో ఆకాష్, చందుకు తీవ్రంగా గాయాలయ్యాయి. విష్ణుకు మాత్రం స్వల్ప గాయమైంది. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు.







గోవిందరాజస్వామికి కళార్చన

తిరుపతి నగరంలో గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. బుధవారం ముత్యపుపందిరి,సింహ వాహనాల్లో స్వామి ఊరేగారు. భక్తులను కటాక్షించారు. వాహన సేవల సందర్భంగా టీటీడీ ఏర్పాటు చేసిన వివిధ కళారీతులు భక్తులను అలరించాయి. ఆధ్యాత్మికవిందును అందించాయి. కళాకారులు చక్కని కళాభినయంతో నర్తిస్తూ మాడవీధుల్లో ఉదయం, సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ముచ్చటగొలిపాయి.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మొండి బకాయిలను వసూలు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ మొండి బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని కమర్షియల్ ట్యాక్స్ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని పన్నుల వసూలు లక్ష్యాన్ని సాధించాలన్నారు. వాణిజ్య పనుల శాఖ జాయింట్ కమిషనర్ జాన్ స్టివెన్సన్, డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాసులునాయుడు, రవికుమార్, మల్లికార్జున, నూర్జాహాన్, రేణుక, పద్మావతి పాల్గొన్నారు.

జూలై 19 నుంచి హనుమ అవార్డ్సు రజతోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న బీఎన్ రెడ్డి

తిరుపతి(జీవకోన), జూన్ 4(ఆంధ్రజ్యోతి): టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో జూలై 19 నుంచి 27వ తేదీ వరకు అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్సు రజతోత్సవం మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు బీఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ వేడుకలకు పోటీదారుల నుంచి 32 పద్య నాటకాలు, 53 సాంఘిక నాటికలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో ఉత్తమమైన ఎనిమిది పద్య నాటకాలు, 10 సాంఘిక నాటికలు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. విజేతలకు నగదు బహుమతితో పాటు హనుమ అవార్డ్సు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ 10 గంటల నుంచి కూచిపూడి, భరతనాట్యం, జానపద బృంద నృత్య పోటీలతో పాటు సోలో నృత్యాలు కూడా ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు 9581154667ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి, శేషేంద్రశర్మ, శేఖర్, అంకమనాయుడు, కొణిదల శోభ, నాగిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.


చిత్తూరులో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్ రెడ్డితోపాటు నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను, ఏపీ గ్రీనరీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి

ఘనంగా పీడ విరగడ దినం


బాణసంచా కాలుస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా జనసేన నేత కిరణ్‌రాయల్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పీడ విరగడ దినం నిర్వహించారు. సాయినగర్‌లోని తన నివాసం వద్ద బాణసంచాపేల్చారు. దీపావళిని తలపించేలా దీపాలను వెలిగించారు. స్వీట్స్ పంచిపెట్టారు.

కూటమి నేతల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు

తిరుపతి అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళం పరిధిలోని ఐదు పంచాయతీలలో ఆయా పార్టీల నేతలు సంబరాలు చేసుకున్నారు. కేక్‌కట్ చేశారు. టపాకాయలు పేల్చారు. స్వీట్స్ పంపిణీ చేశారు. సైకో పాలనకు స్వస్తిపలికి, సుపరిపాలన వచ్చిందని నినాదాలు చేశారు.

రద్దీకి అనుగుణంగా అభివృద్ధి ఏది?

తిరుపతి, రేణిగుంట స్టేషన్లపై దృష్టి సారించని రైల్వే బోర్డు

తిరుపతి(సెంట్రల్), జూన్4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల-తిరుపతి పుణ్యక్షేత్రాలకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేసి, స్టేషన్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారత రైల్వేలో గ్రేడ్-1 స్టేషన్లలో తిరుపతి ఒకటి. దీనికి తగినట్లు ఏనాడూ నిధులు విడుదల చేయడం లేదన్న విమర్శలున్నాయి. అలాగే తిరుపతికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేణిగుంట రైల్వే జంక్షన్‌ను టెర్మినల్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన పట్టాలెక్కడం లేదు. ఇక్కడి నుంచి కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు ప్యాసింజర్లను పుణ్యక్షేత్రాలను అనుసంధానం చేస్తూ నడపాలని భక్తులు కోరుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. తిరుపతి-రేణిగుంట మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాల్సి ఉంది. చంద్రగిరి రైల్వేస్టేషన్ అభివృద్ధి గురించి గాలికి వదిలేశారు. సీఆర్ఎస్ సామర్థ్యం పెంచాల్సిన అవసరముంది. తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్‌లో అవసరమైన మేరకు అభివృద్ధి పనులు చేయడం లేదు. ప్యాసింజర్ రైళ్లను అక్కడి నుంచే నడిపేవిధంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. పాకాల రైల్వే జంక్షన్‌కు ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. తిరుపతి స్టేషన్‌లో భక్తులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరముంది.

'వైసీపీ ఆరోపణలు నిరాధారం'

తిరుపతి(జీవకోన), జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆరోపణలు నిరాధారమైనవని పద్మావతీపురం మాజీ సర్పంచ్ గణపతినాయుడు అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తాను అవినీతికి పాల్పడి రూ.కోట్లు సంపాదించినట్లు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. అది నిజమే అయితే అందులో తనకు 5 శాతం ఇస్తే చాలన్నారు. వైసీపీ నుంచి బయటకు వస్తే ఎవరి పరిస్థితి అయినా ఇలానే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై ఆరోపణలు చేసిన వారి గురించి గతంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి చెప్పినా తాను వినలేదన్నారు. ఈ కార్యక్రమంలో చిగురువాడ సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, కుర్రకాల్వ సుధాకర్, రాజేంద్ర, సునీల్ చౌదరి, శ్రీనివాసులు, గోపాల్, ఉమాపతి పాల్గొన్నారు.

రోవర్ స్కౌట్, రేంజర్ లీడర్ యూనిట్ల రెన్యువల్‌కు అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన రోవర్ స్కౌట్ లీడర్లు, రేంజర్ టీం లీడర్లు తమ యూనిట్లను రెన్యువల్ చేసుకోవాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి విజయకుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో జిల్లా పరిధిలోని రోవర్ స్కౌట్ లీడర్, రేంజర్ లీడరుగా శిక్షణ పొంది రెన్యూవల్ చేసుకోకపోయినా, ప్రస్తుతం వారి సర్టిఫికెట్లు యూనిట్ సభ్యుల వివరాలను రాష్ట్ర సహాయ కార్యనిర్వాహక కమిషనర్ ఎన్.కోటేశ్వరరావు వాట్సాప్ 9666223796కు పంపాలని పేర్కొన్నారు. రెన్యూవల్ చేసుకున్న వారికి మాత్రమే ప్రముఖ ఆలయాల్లో సేవలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


కె.సాయికుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగ పరిశోధకుడు కన్నోజు సాయికుమార్ డాక్టరేట్ పొందారు. స్టడీస్ ఆన్ జియోపాలిమర్ కాంక్రీట్ యుటిలైజేషన్ ఆఫ్ ఎగ్‌షెల్ పౌడర్ ఇంటిగ్రేటెడ్ విత్ సస్టైనబుల్ మెటీరియల్స్ అంశంపై డాక్టర్ ఎన్.మునిలక్ష్మి పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.

డీఎస్సీ పరీక్ష రోజున పీజీసెట్ వాయిదా వేయండి


కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

తిరుపతి (విశ్వవిద్యాల యాలు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షల రోజున చేపట్టే ఏపీ పీజీసెట్-2025 పరీక్షను వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఓంరాజ్, విష్ణు తదితరులు కోరారు. ఈ మేరకు పీజీ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లను కలిసి బుధవారం వారు వినతిపత్రం అందజేశారు.

కుక్కల దాడిలో జింక మృతి

కోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం సమీపంలో ఉన్న చల్లకాలువలో బుధవారం కుక్కలదాడిలో చుక్కల జింక మృతి చెందింది. చిల్లకూరు మండలం ఉడతావారిపాళెం, అంకులపాసూరు, పల్లమాల అటవీప్రాంతం నుంచి ఓ జింక దాహార్తిని తీర్చుకు నేందుకు నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న చల్లకాలువలోకి వచ్చింది. కుక్కలు దానిపై దాడి చేశాయి. స్థానికులు రక్షించారు. అప్పటికే అది మృతి చెందింది.

సుపరిపాలనకు వసంతం


తన నివాసం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాల్లో సుపరిపాలన వచ్చి ఏడాదైందని, ఈ కాలంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఎస్టీవీనగర్‌లోని గంగమ్మవీధిలో బుధవారం ఉదయం నిర్వహించిన ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే దంపతులు పరిశీలించారు. సుజాత(ప్రథమ), ప్రమీల(ద్వితీయ), దీప్తి, పూజిత (తృతీయ)లకు బహుమతులు అందజేశారు. సాయంత్రం తన నివాసం వద్ద ఎమ్మెల్యే దీపాలు వెలిగించి, కేక్‌కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ పిలుపుమేరకు సంక్రాంతి, దీపావళి కలిపి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీపావళి రోజు నరకాసురుని వధించినట్లు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, ఎస్కే బాబు, దూదిశివ, వినోద్‌రాయల్, తిరుత్తణి వేణు, హరిశంకర్, దినేష్‌జైన్, సుభాషిణి, కీర్తన, ఆకుల వనజ పాల్గొన్నారు.

ప్రజల స్వేచ్ఛకు ఏడాది

ఘనంగా టీడీపీ సంబరాలు


అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న సుగుణమ్మ, మునికృష్ణ తదితరులు

తిరుపతి, జూన్6(ఆంధ్రజ్యోతి) : కూటమికి అనుకూలంగా ఎన్నికల ఫలితాలు వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా తిరుపతిలో టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నాయి. ఏపీజీబీసీ చైర్మన్, టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేశారు. టౌన్‌క్లబ్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి బాణసంచా పేల్చారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు రాక్షస పాలనకు చరమగీతం పాడి ఏడాది పూర్తయిందన్నారు. స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయకులు కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, సూరా సుధాకర్ రెడ్డి, మన్నెం శ్రీనివాసులు, చినబాబు, ఆముదాల తులసీరాం, కంకణాల రజనీకాంత్ నాయుడు, మస్తాన్ నాయుడు, మునిశేఖర్ రాయల్,బ్యాంకు శాంతమ్మ, కరాటే చంద్ర, మునిరామయ్య, రాజయ్య, రామూర్తి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి


ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ మౌర్య

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మానవాళికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించేందుకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్పొరేషన్ కార్యాలయంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారులతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో 120 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్నటువంటి ప్లాస్టిక్, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా గుడ్డ, జూట్, ఇతర రీసైక్లబుల్ బ్యాగులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ బీట్ - ప్లాస్టిక్ పొల్యూషన్ నినాదంతో మూడు నెలల్లో తిరుపతిలో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, వ్యాపారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ

ఎస్వీయూ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్వీయూ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ఎస్వీ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు పేర్కొన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా చేపట్టిన విద్యార్థుల ప్రతిభా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. సురేంద్రబాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రకృతి పట్ల దృష్టి కలిగి ఉండాలన్నారు. పచ్చదనాన్నీ, పర్యావరణాన్నీ కాపాడుకోవాలన్నారు. లేకపోతే ఇతర జీవుల మనుగడ, ముఖ్యంగా మనిషి మనుగడ అసాధ్యమన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు సామాన్య ప్రజలకు అందించాలని కోరారు. వర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్‌చౌదరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ఈ తరంలో అవగాహన కల్పించే లక్ష్యంతో వ్యాస రచన, వక్తృత్వం, పెయింటింగ్ వంటి పోటీలు చేపట్టామన్నారు. విజేతలకు యూనివర్సిటీలో నిర్వహించే పర్యావరణ పరిరక్షణ సదస్సులో బహుమతులు అందజేస్తామన్నారు.





శ్రీవారిసేవలో ప్రముఖులు


తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిరణ్మయ్ భట్టాచార్య వేకువజాము సుప్రభాత సేవలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో రిలయన్స్ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, ఎమ్మెల్యే గుమ్మానూరు జయరాం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై కానిస్టేబుల్ దాడి!



తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎలక్ట్రికల్ డ్రైవర్‌పై ఓ కానిస్టేబుల్ దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాలివి.. తిరుమలలోని మాధవనిలయం ముందు మంగళవారం రాత్రి 7.30 గంటలకు ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ ఆపాడు. ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్నాడని వెనుకే ద్విచక్రవాహనంపై వస్తున్న కానిస్టేబుల్ ఆగ్రహంతో బస్సు ఎక్కి డ్రైవర్‌పై దాడి చేశాడు. బస్సులోని సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డు అయ్యాయి. ప్రస్తుతం ఆ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. తమకు ఫిర్యాదు రాలేదని, డ్రైవర్ నుంచి ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.29 కోట్లు

మంగళవారం దర్శించుకున్న భక్తుల సంఖ్య 78,631

తలనీలాలు సమర్పించినవారు: 31,247

ముప్పును మోసుకొస్తున్న సంచులు

- ప్లాస్టిక్ వ్యర్థాలతో మనుగడకు పెనుసవాలు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

జీవరాశుల మనుగడలో పర్యావరణ పాత్ర కీలకం. ఆధునిక పరిస్థితుల నేపథ్యంలో రకరకాల కారణాలతో రాన్రానూ పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. మానవ మనుగడకు సవాలు విసురుతోంది. కాలుష్య కోరల్లోకి చేర్చుతూ ప్రమాదంలోకి నెట్టెస్తోంది. ప్రజలు, ప్రభుత్వాలు మేల్కొని బాధ్యతగా స్పందించకపోతే భావితరాల జీవనానికి పెనుముప్పు కాగలదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

- తిరుపతి రూరల్ (ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్ వ్యర్థాలతో ముప్పు

ప్లాస్టిక్.. ఈతరం ప్రజల జీవితంతో విడదీయరానంతంగా పెనవేసుకుపోయింది. ఉదయం పాలప్యాకెట్లతో మొదలై ప్రతి చిన్న వస్తువుకూ కవరుగా మారిపోయింది. నగరంలో ఈ ఈ ప్రభావం మరితం ఎక్కువగా ఉంది. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం పెరిగి పర్యావరణానికి, ఆరోగ్యానికి పెనుముప్పుగా తయారైంది. ప్రమాదకర వ్యాధులకు కారణమవుతోంది. పలుచగా తక్కువ బరువు ఉండటంతో యూజ్ అండ్ త్రో కవర్లను విరివిగా వాడుతున్నారు. అవసరం తీరాక ఈ సింగిల్‌యూజ్ పాలిథిన్ వ్యర్థాలను డ్రైనేజీ కాలువలు, చెత్తకుప్పలు, రోడ్డుపక్కన పడేస్తున్నారు. ఇవి భూమిలో కలిసేందుకు వేల సంవత్సరాలు పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, కుక్కలు లాంటిని తెలియకుండా ఆహారంగా తీసుకుని అనారోగ్యం పాలవుతున్నాయి. నిర్దేశిత ప్రమాణాలను అతిక్రమిస్తూ టీ షాపుల్లో వాడుతున్న కప్పులు, పార్శిల్ కోసం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులు క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులకు కారణమవుతున్నాయి.

నిషేధం అమలు అంతంతమాత్రమే..

తిరుపతి నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినా అమలు నామమాత్రంగానే ఉంది. అధికారులు చిత్తశుద్ధితో ఉద్యమంలా ప్రజల్లో అవగాహన కల్పిస్తే నిషేధానికి ముకుతాడు వేయడం కష్టమేంకాదు. అమ్మతున్న వారిపై కేసులు పెట్టి చేతులు దులుపుకొనే కన్నా వాటి ఉత్పత్తి మూలాలను గుర్తించి కట్టడి చేయాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని సంస్థలు ఇప్పటికే తమ ఉత్పత్తుల ప్యాకింగుకు గుడ్డ సంచులు ఇస్తున్నాయి. ఈ సంస్కృతి అన్నిటా వ్యాపించేల చూడాలి. తిరుమలలో ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్ల విక్రయాల నిషేధం మాత్రం పక్కాగా అమలవుతోంది. గాజుసీసాలను వినియోగిస్తున్నారు.



పెరుగుతున్న వాయుకాలుష్యం

తిరుమల నేపథ్యంలో భారీ సంఖ్యలో రోజూ వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం పెరిగిపోతోంది. గాలిలోని పర్టిక్యులేట్‌మేటర్స్(పీఎం) కారకాలుగా పనిచేస్తున్నాయి. మూడేళ్లకు ముందు తిరుపతిలో పీఎం 2.5లెవల్స్ 22మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్ ఉండగా..ఇటీవల 32 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా నమోదైనట్లు సమాచారం. పీఎం10లెవల్స్‌మూడేళ్లకు ముందు 53మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా ఉండగా ఇప్పుడు 74మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌కి చేరుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.. డబ్ల్యూహెచ్‌వో సిఫార్సుల మేరకు పీఎం 2.5లెవల్స్‌లో 15 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా, పీఎం10లెవల్స్‌లో 45 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్ ఉండాలి. ఈ పెరుగుదల క్రమంలోనే అనారోగ్యసమస్యలు తలెత్తుతున్నాయి. తిరుపతి పరిసరాల్లో పారిశ్రామికాభివృద్ధి, అమాంతం పెరిగిన డీజల్ వాహనాలు, వ్యర్థాల కాల్చివేత లాంటి వాటివల్ల కూడా గాలి కాలుష్యమవుతోంది. ఇది పర్యావరణానికి చేటు కలిగిస్తూ అనారోగ్యసమస్యలకు కారణమవుతోంది.

తూకివాకం వద్ద ప్లాంట్

నగరంలో రోజుకు సగటున రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో పునర్వినియోగపరచదగినవి(రీసైకిల్), పునర్వినియోగ పరచలేని(నాన్ రీసైకిల్) వేరు చేసేందుకు తూకివాకం వద్ద పీపీపీ విధానంలో(సెంట్రలైజ్డ్ యూనిట్)ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇది రోజుకు ఐదు టన్నుల ప్లాస్టిక్‌ని ప్రాసెసింగ్ చేసే సామర్థ్యాన్ని కలిగిఉంది. తక్కువ గ్రేడ్ ప్లాస్టిక్‌ని కూడా ఇక్కడప్రాసెస్ చేస్తున్నారు. రీయూజబుల్ కానివాటిని జిందాల్‌గ్రూప్ సంస్థతో ఒప్పందం చేసుకుని ప్రాసెస్ చేస్తున్నారని తెలిసింది.



అవగాహన పెంచాలి



ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచాలి. తరచూ సదస్సులు నిర్వహించాలి. కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు విరివిగా మొక్కలు నాటాలి. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. ప్రత్యామ్నాయ వినియోగాలవైపు ప్రజల దృష్టి మరల్చాలి. చిత్తశుద్ధితో పర్యవేక్షణ అవసరం. సింగిల్ యూజ్ కవర్ల ఉత్పత్తిని ఆపగలిగితే ఉత్తమం. ఎకోఫ్రెండ్లీని పెంచాలి.

- ప్రొఫెసర్ డాక్టర్ తేటి దామోదరం, పర్యావరణ శాస్త్రవిభాగ హెడ్, ఎస్వీయూ

తడి, పొడిచెత్త వేరుచేసి ఇవ్వాలి



తిరుపతి నగరంలో తడి, పొడిచెత్తలను వేరుచేయకుండా ఇస్తున్నారు. దీని నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయడం కష్టంగా ఉంటోంది. ఇంటివద్దే వేరుచేసి ఇవ్వాలి. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను పడేయడాన్ని మానుకోవాలి. ఇది అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. చెత్తను కాల్చినపుడు వచ్చే పొగతో కాలుష్యంతోపాటు అనారోగ్యసమస్యలు తలెత్తుతాయి.

-ఎన్.మౌర్య, నగరపాలకసంస్థ కమిషనర్

అవినీతి రహిత పాలన అందిస్తా

- రాష్ట్రస్థాయిలో చిత్తూరు డీసీసీబీని ప్రథమ స్థానంలో నిలుపుతా
- పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న అమాస రాజశేఖర్ రెడ్డి, పక్కన చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) బలోపేతానికి కృషి చేస్తూనే.. అవినీతి రహిత పాలన అందిస్తామని పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జిగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమాస ప్రసంగించారు. గత అనుభవాలను బేరీజు వేసుకుంటూ రాష్ట్రస్థాయిలో చిత్తూరు డీసీసీబీని ప్రథమ స్థానంలో నిలుపుతానని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని, రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. తిరోగమనం పట్టిన బ్యాంకును గాడిలో పెట్టి పూర్వవైభవం తేవాలని సూచించారు. బ్యాంకు అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి పాలకవర్గం కోట్లాది రూపాయిలను దోపిడీ చేసిందన్నారు. దీనిపై తాను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఏపీ గ్రీనరీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, టీడీపీ నాయకులు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, చెరుకూరి వసంత్‌కుమార్, ఎన్‌పీ జయప్రకాష్, బాలాజీ నాయుడు (గుడిపాల మాజీ జడ్పీటీసీ), జేఎంసీ శివ, కోదండ యాదవ్, బీజేపీ నాయకులు నవీన్‌కుమార్ (తిరుపతి), కొత్తూరు బాబు, హరిబాబు చౌదరి, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి (తిరుపతి), తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులపై నిరంతర అప్రమత్తత అవసరం

- భద్రతా దళాలు, టీటీడీ సిబ్బందితో ఏఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రామకృష్ణ

తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో అలజడి సృష్టించేందుకు ఏరూపంలో ఉగ్రవాదులొచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భద్రతాదళాలతో పాటు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ రామకృష్ణ అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో టీటీడీ విజిలెన్స్, సివిల్ పోలీసు, ఏఆర్, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, ఫైర్‌తో పాటు టీటీడీ అధికారులు, సిబ్బంది, అర్చకులు, పోటు కార్మికులు, ట్యాక్సీ డ్రైవర్లు, మఠాల నిర్వాహకులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ఉగ్రవాదులు మనలోనే కలిసిపోయి హింస సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంటారన్నారు. కూలీల ముసుగులోనూ వచ్చే అవకాశాలుంటాయన్నారు. కొన్ని సందర్భాల్లో మనం గుర్తించే చిన్నచిన్న విషయాలే పెద్ద విపత్తుల నుంచి రక్షించేందుకు ఉపయోగపడతాయన్నారు. సూరత్‌లో ఉగ్రవాదులు అమర్చిన బాంబులను స్థానికులే గుర్తించడంతో దాదాపు 29 బాంబుల నుంచి ప్రజలు ప్రాణాలతో బయటపడ్డారని సోదాహరించారు. ఇదే తరహాలో దేశంలోని పలు ఆలయాల్లో జరిగిన ఉగ్రదాడులు, అక్కడ జరిగిన నష్టం, ఎలా బ్లాస్టులు చేశారు వంటి వివిధ అంశాలను స్ర్కీన్‌పై ప్రదర్శించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే ఎలా స్పందించాలి, తక్షణం చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు.

సింహ వాహనంపై అనంత తేజోమూర్తి





తిరుపతి అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం మాడ వీధుల్లో సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహనాల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహనం మందు గజరాజులు, గోవులు ఠీవీగా నడుస్తుండగా కళాబృందాలు కోలాటాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.మంగళవాయిద్యాల నడమ ఈ ఉత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో జియ్యంగార్లు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేమ్స్‌పై దాడి కేసులో మరో ఆరుగురి అరెస్టు

తిరుపతి(కలెక్టరేట్),జూన్4(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న జేమ్స్‌పై గతనెల 14న జరిగిన దాడిలో 18మందిపై కిడ్నాప్, హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం ప్రధాన నిందితుడు యశ్వంత్‌తో పాటు 12మందిని తిరుచానూరు పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. బుధవారం ఈ కేసులో ప్రమేయమున్న చోటా బ్లేడ్, దీపక్‌కుమార్, జగదీష్, సాయి హరితేజ, రూపేష్, సోమశేఖర్‌లను పాడిపేట శేషాద్రినగర్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి తెలిపారు.రూపేష్‌పై రౌడీషీట్, చోటా బ్లేడ్, జగదీష్‌లపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వివరించారు. కాగా, అరెస్టు అయిన ఆరుగురూ వైసీపీకి చెందిన మాజీ మంత్రి, తిరుపతి మాజీ డిప్యూటీ మేయర్ అనుచరులే కావడం గమనార్హం.

ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్‌గా చరణ్

తిరుపతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ తిరుపతి జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా రుద్రరాజు చరణ్ నియమితులు కానున్నారు. ప్రస్తుతం స్టేట్ ఆడిట్ శాఖలో స్పెషల్ క్యాడర్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా తిరుపతిలో పనిచేస్తున్న చరణ్‌ను ప్రభుత్వం బుధవారం పరిశ్రమల శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ చేసింది. ఆ శాఖలో ఆయన ఏపీఐఐసీ తిరుపతి జోన్‌కు డిప్యూటీ జోనల్ మేనేజర్ (అసెట్ మేనేజ్‌మెంట్) పోస్టులో నియమితులు కానున్నారు. డెప్యుటేషన్‌పై ప్రాథమికంగా ఆయన సంబంధిత పోస్టులో ఏడాది పాటు కొనసాగనున్నారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజ్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

- దోపిడీలకు పాల్పడింది

మధ్యప్రదేశ్ గ్యాంగా.. హరియాణానా!

ముమ్మరంగా సాగుతున్న పోలీసు దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం), మే 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం ఆటోనగర్ వద్ద.. రూరల్ మండలం దామినేడు వద్ద మారుతీ షోరూంలలో దోపిడీకి పాల్పడింది మధ్యప్రదేశ్ ముఠానా లేదా హరియాణా గ్యాంగా అనే దిశగా పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను నియమించారు. ఫింగర్ ప్రింట్లు, ఫొటోలు, కనుబొమ్మలు తదితర ఆధారాలతో పరిశీలిస్తున్నారు. ఇప్పటికే దోపిడీదారుల ఆచూకీ లభించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ రెండు ఘటనల్లోనూ లభించిన సీసీ ఫుటేజీల ఆధారంగా దోపిడీ దొంగలను గుర్తించినట్లు తెలిసింది. వీరంతా యువకులే కావడంతో పాటు వారి ముఖాలు, కనుబొమ్మలు గుర్తించిన దర్యాప్తు బృందాలు ఆ దిశగా ముందుకు కదులుతున్నారు. ఈ బృందాల్లో చాలావరకు హిందీ బాగా మాట్లాడగలిగే వారిని నియమించినట్లు తెలిసింది. ఒక డీఎస్పీతో పాటు ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 10 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.



రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పిన యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి వర్గ సమావేశం సందర్భంగా నారా లోకేశ్ సహచర మంత్రులకు అందజేశారు. ఇలా లోకేశ్ నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్.



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

10న నాయుడుపేటలో మెగా జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 17 బహుళజాతి కంపెనీల్లో 900కు పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 5వ తరగతి పైన, పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణులైన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత లింక్‌లో ఈనెల 9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9985056929, 9154449677లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి గణేష్ పాల్గొన్నారు.

జనసేన సంబరాలు



రంగవల్లుల వద్ద జనసేన నాయకులు

గూడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కొండాగుంట గ్రామంలో మహిళలు రంగవల్లులు వేసి సంబరాలు నిర్వహించుకున్నారు. జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసీపీ అరాచకపాలన అంతమై ఎన్‌డీఏ సుపరిపాలన మొదలై ఏడాది కావడంతో సంబరాలు చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, విజయ్, సాయిక్రిష్ణ, మనోజ్, సుమన్, ముత్యాలు, మస్తాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకపాలన సాగుతోంది



వైసీపీ నిరసనలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఏడాదిగా ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి అధికార పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి రాజారెడ్డి, చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, దారా రవి, దశరథరామిరెడ్డి, భవానీరెడ్డి, కమలాకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.

కూటమి సుపరిపాలనకు ఏడాది



అన్నదానం చేస్తున్న సుమిత్ర, తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ సుపరి పాలన ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా అంకు సుమిత్ర ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అన్నాక్యాంటీన్‌లో 450 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకురాలు సుమిత్ర మాట్లాడుతూ పేదల ఆకలితీరుస్తున్న కూటమి ప్రభుత్వం మరో దశాబ్దం పాటు పాలన సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషం మునిగోపి, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, భార్గవి, రమ్య, రుషిత తదితరులు ఉన్నారు.

కాకాణితో వైసీపీ ఎంపీల ములాఖత్

● 11, 12 తేదీల్లో జగన్ నెల్లూరు రాక

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో బుధవారం రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి ములాఖత్ అయ్యారు. అనంతరం మిధున్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాకాణిని పరామర్శించేందుకు నెల్లూరు సెంట్రల్ జైలుకు వస్తారని తెలిపారు. అక్రమంగా, అకారణంగా కాకాణిపై కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని ప్రశ్నించడమే కాకాణి చేసిన తప్పన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ఏదో జరిగిపోతుందని, భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. కాకాణి జైల్లో ఎంతో ధైర్యంగా ఉన్నారని , ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేది లేదని ఆయన చెప్పారు. త్వరలోనే ఆయన జైలు నుంచి బయటకు వస్తారని ఆశిస్తున్నామన్నారు.

పర్యావరణ రక్షణ కోసం మొక్కలు నాటాలి



కొండాపురం సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వాకాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచిం చారు. మండలంలోని కొండాపురం పంచాయతీలో ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు లాంటి సమస్యలు ఉంటే ప్రజలు కాల్‌సెంటర్ నెంబరు 9505234689కి ఫోన్‌చేసి పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

ఇంటికి దారిలేకుండా చేశారు.. న్యాయం చేయండి

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తమ ఇంటికి ఉన్న దారిని దౌర్జన్యంగా మూసేశారని, దీనిపై తగిన న్యాయం చేయాలని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డికి బాధితులు విన్నమాల ధనయ్య, అక్కుర్తి చిన్ని వీరరాఘవులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈసదర్భంగా వారు మాట్లాడుతూ బంగారంపేట పంచాయతీ మోదుగుల పాలెం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పంచాయతీ వీధి ఉందని గుర్తు చేశారు. తమ ఇంటికి పక్కన వారు తమ ఇంటికి దారి లేకుండా వీధిని ఆక్రమించారని వాపోయా రు. దారి స్థలంలో ఫెన్సింగ్ వేసి పూర్తిగా దారి మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన యోగాసనాలు



కోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 16 సచివాలయాలలో జరుగు తున్న యోగా సన శిక్షణా తరగతులు బుధ వారం ముగిశాయి. ఎంపీడీవో దిలీప్ కుమార్‌నాయక్ పర్య వేక్షణలో యోగా ప్రాముఖ్యతను తెలుపుతూ సచివాలయాల వారీగా శిక్షణ తరగతులు జరుగు తున్నాయి. శిక్షణ తరగతులు ముగియడంతో గురు వారం మండలస్థాయి యోగాసన శిక్షణ తరగతులు జరుగుతాయని మండల స్థాయిలో ఆయా ట్రైనర్లకు శిక్షణ ఇస్తామని ఎంపీడీవో తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న ఎంఈవో జగదీష్ బాబు

డక్కిలి, జూన్ 4 : (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో పిన్నక జగదీష్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన నిర్వా హకులకు టాటా ట్రస్టు ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న క్రమంలో మెనూపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఇంటి రుచులతో భోజనం వడ్డించాలని తెలియ జేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం సూళ్లూరుపేటలోని సూళ్లూరు లో జనసేన ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ము గ్గుల పోటీలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ కుమార్ విచ్చేశారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆవుల రమణ, తుసిరెడ్డి, నక్కా హరిబాబు, వల్లూరు కిరణ్, కృష్ణారావు, పద్మజ కామాక్షి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడిని జయించవచ్చు



యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు

సూళ్లూరుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఒత్తిడిని జయించవచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ ఎస్ఏఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా ట్రైనర్ నివేదిత ఆధ్వర్యంలో అధ్యాపకులకు, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిం చారు. యోగాసనాలు వేయించారు. అధ్యాపకులు సుబ్రమణ్యం, బి.శ్రీనివాసులు, అమ్మాజీ, ఎన్‌సీసీ అధికారి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో చోరీ

నాయుడుపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఏఈ వీరాస్వామి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన కంప్యూటర్ సామగ్రి దాదాపు లక్ష రూపాయలు విలువచేస్తాయని తెలియజేశారు.

న్యాయం చేసేవరకు కంటైనర్లను కదలనివ్వం

నాయుడుపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మృతుడి కుటుంబానికి న్యాయం చేసేవరకు కంటైనర్‌లను వదిలేదని లేదని ఓజిలి మండలం గ్రద్దకుంట గ్రామస్తులు స్పష్టం చేశారు. మేనకూరు సెజ్ సమీపంలో కంటైనర్ ఢీకొని ఆదివారం గ్రద్దకుంటకు చెందిన చిరంజీవి అనే యువకుడు మృతిచెందాడు. ప్రమాద సమయంలో కంటైనర్లకు సంబంధించిన కంపెనీ వారు మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రమాదం జరిగి మూడు రోజులైనా న్యాయం జరగకపోవడంతో బుధవారం గ్రామస్తులు మేనకూరు సెజ్ నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న లారీలను వారి గ్రామ సమీపంలో ఆపేశారు. పోలీసులు ఇరువర్గాలతో చర్చిస్తున్నారు.

దిగుబడి రాక ధరలు లేక
మామిడి రైతులు విలవిల



తిప్పవరపాడు గ్రామ సమీపంలో మామిడి తోట (ఇన్‌సెట్లో) బంగినపల్లి మామిడి కాయలు

గూడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలాలు శ్రమించి.. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి.. తీరా ఫల సాయం చేతికి అందే సమయంలో ఆశించిన దిగుబడులు రాకపోవడంతో మామిడి రైతులు విలవిలలాడుతున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో.. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టాలబాటలో నడుస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు.

గూడూరు మండలంలో ఈ ఏడాది 750 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటల సాగు చేపట్టారు. ఇందులో 520 ఎకరాల విస్తీర్ణంలో మామిడి కాయలు కాసే తోటలు ఉన్నాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో బంగినపల్లి, రసాలు, నీలం, పునాశ, అంటుమామిడి వంటి రకాల తోటలను సాగు చేస్తుంటారు. ఇందులో 85 శాతంకు పైగా బంగినపల్లి రకానివే. ఈ ప్రాంతంలో బంగినపల్లి రకానికే డిమాండ్ ఎక్కువ. అందుకే రైతులు వీటినే సాగు చేసేందుకు మక్కువ చూపుతుంటారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడం, కాయలకు నల్లి పురుగు పట్టడం కారణంగా ఆశించిన ఆదాయం అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిపోయిన దిగుబడి

మామిడి పూత దశకు చేరుకునేందుకు, పిందె నిలబడేందుకు పురుగు మందులు పిచికారి చేయాల్సి ఉంటుంది. ఎకరా మామిడి సాగుకు రూ.1.50 లక్షల పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎకరా మామిడి చెట్లకు సరాసరి 10 టన్నుల వరకు కాయల దిగుబడి వస్తుంది. కాయల నాణ్యతను బట్టి ధరలు ఉండడంతో రైతుల ఖర్చుల పోనూ ఎంతో కొంత ఆదాయం మిగులుతుంది. ఈ ఏడాది 10 ఎకరాలలో 10 టన్నుల దిగుబడి కూడా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటలను లీజుకు తీసుకునే కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎకరాకు లీజు రూ.30 వేలకు వరకు చెల్లిస్తారు. దీనికి తోడు కాపు సాగుకు రూ. 1.50 లక్షల వరక వెచ్చించారు. ఈ ఏడాది వాతావవరణంలో మార్పుల వలన ఈదురుగాలలకు చెట్ల నుంచి కాయలు రాలిపోయాయి. కాయలకు నల్లిపురుగు పట్టడంతో చెట్ల మీదే కాయలకు నల్లమచ్చలు ఏర్పడ్డాయి. అలాగే పురుగులు పట్టడంతో అవి కాస్త రాలిపోయా యి. ఈ ఏడాది ఎకరాకు టన్ను కాయలు కుడా దిగుబడి రాలేదని దిగాలు చెందుతున్నారు. గతేడాది ఎకరాకు 10 టన్నులు కాయలు వస్తే టన్ను ధర రూ.80 వేల వరకు పలికిందని చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు టన్ను కాయలు కూడా దిగుబడి రాలేదని పైగా టన్ను రూ. 30 వేల వరకు మాత్రమే ధరలు పలుకుతోందని ఆవేదన చెందుతున్నారు. నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నాణ్యమైన పురుగుమందులు అందజేయాలి



ఈ ఏడాది మామిడి కాయలకు నల్లి పురుగు పట్టడంతో ఐదు సార్లుగా పైగా పురుగుమందులను పిచికారి చేశాం. అయినా ఫలితం లేకుండా పోయింది. ఎకరాకు రూ. 1.50 లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టినా రూ. 40 వేలు కూడా రాలేదు. ప్రభుత్వం నాణ్యమైన పురుగు మందులను అందించేలా చర్యలు తీసుకోవాలి.

- డి.సుబ్బారెడ్డి, రైతు, తిప్పవరపాడు గ్రామం

అప్పులే మిగిలాయి



ఈ ఏడాది ఎకరాకు రూ.30 వేలు లీజు చెల్లించి బంగినపల్లి మామిడితోటను తీసుకున్నా. ఎకరాకు రూ. 1.40 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం ఎకరాకు టన్ను లోపే దిగుబడి వచ్చింది. పురుగు పట్టడంతో పాటు ఈదురుగాలులకు కాయలు రాలిపోవడంతో కాపు చేతికి అందలేదు. టన్ను రూ. 30 వేలకు వరకు మాత్రమే ధరలు పలుకుతోంది. నష్టపోయా. మిగిలాయి.

- ఎస్‌కే.ఖాదర్‌బాషా, కౌలురైతు, నెల్లూరు.

వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అరాచకానికి ప్రజలు తగిన గుణపాఠం చెబితే వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఆగడాలు భరించలేక ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెప్పిన విధంగా పింఛన్‌ను 1000 రూపాయలు పెంచిందన్నారు. కార్పొరేషన్ రుణాలను అందిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీల ను ఆదుకుంటోందన్నారు. అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభించి తక్కువ ధరలకే పేదలకు మూడు పూటలా ఆకలి తీర్చుతోందన్నారు. త్వరలోనే తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను ప్రారంభించనుందన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని మరోసారి వైసీపీకి తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో సిద్ధంగా ఉన్న మొక్కలు

సూళ్లూరుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనం-మనం కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేటలో గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటునున్నారు. . జీఎన్‌టీ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి, యూనియన్ బ్యాంకు రోడ్డులో మున్సిపాలిటీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తవ్విస్తున్నారు. అదేవిధంగా మండ లంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నట్లు ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్, కృష్ణ తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలో రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పరుగులు తీస్తోందని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా బుధవారం పట్టణంలోని గాంధీ మందిరం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలతో పాటు పాల్గొన్నవారందరికీ బహుమతులు అంద జేశారు. జనసేన నాయకులు అట్లకృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

రాక్షస పాలన విముక్తి దినం



మాట్లాడుతున్న పేరం రమేష్‌నాయుడు

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన శుభ దినాన్ని రాక్షస పాలన విముక్తి దినంగా పాటిస్తున్నామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాదరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెళ్లకూరులోని రమేష్‌నాయుడు నివాసంలో వారు మీడియాతో మాట్లాడారు.

రాక్షస పాలనకు స్వస్తి పలికి ఏడాది : టీడీపీ



మాట్లాడుతున్న జలీల్ అహ్మద్, మధుయాదవ్

కోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐదేళ్లపాటు కొన సాగిన రాక్షసపాలనకు ప్రజలు చరమగీతం పాడి ఏడాది అయిందని టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్ తెలిపారు. కోటలోని రవినగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో బుధ వారం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఈ నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు కాబోతున్నాయని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయా ణం అమలుకాబోతుందని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం నవ్యాంధ్రవైపు పరుగులు తీస్తోందన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



కోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం సమీపంలో ఉన్న చల్లకాలువలో బుధవారం కుక్కలదాడిలో చుక్కల జింక మృతి చెందింది. చిల్లకూరు మండలం ఉడతావారిపాళెం, అంకులపాసూరు, పల్లమాల అటవీప్రాంతం నుంచి ఓ జింక దాహార్తిని తీర్చుకునేందుకు నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న చల్లకాలువలోకి వచ్చింది. కుక్కలు దానిపై దాడి చేశాయి. స్థానికులు రక్షించారు. అప్పటికే అది మృతి చెందింది. అటవీ అధికారులు జింక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు అర్బన్, జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పేరుతో ర్యాలీ నిర్వహిం చారు. సబ్ కలెక్టర్ కార్యా లయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్రరెడ్డి, భక్తవత్సలరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సునీల్‌రెడ్డి, గురవయ్య, బొమిడి శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రద్దీకి అనుగుణంగా అభివృద్ధి ఏది?

తిరుపతి, రేణిగుంట స్టేషన్లపై దృష్టి సారించని రైల్వే బోర్డు

తిరుపతి(సెంట్రల్), జూన్4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల-తిరుపతి పుణ్యక్షేత్రాలకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేసి, స్టేషన్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారత రైల్వేలో గ్రేడ్-1 స్టేషన్లలో తిరుపతి ఒకటి. దీనికి తగినట్లు ఏనాడూ నిధులు విడుదల చేయడం లేదన్న విమర్శలున్నాయి. అలాగే తిరుపతికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేణిగుంట రైల్వే జంక్షన్‌ను టెర్మినల్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన పట్టాలెక్కడం లేదు. ఇక్కడి నుంచి కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు ప్యాసింజర్లను పుణ్యక్షేత్రాలను అనుసంధానం చేస్తూ నడపాలని భక్తులు కోరుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. తిరుపతి-రేణిగుంట మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాల్సి ఉంది. చంద్రగిరి రైల్వేస్టేషన్ అభివృద్ధి గురించి గాలికి వదిలేశారు. సీఆర్ఎస్ సామర్థ్యం పెంచాల్సిన అవసరముంది. తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్‌లో అవసరమైన మేరకు అభివృద్ధి పనులు చేయడం లేదు. ప్యాసింజర్ రైళ్లను అక్కడి నుంచే నడిపేవిధంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. పాకాల రైల్వే జంక్షన్‌కు ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. తిరుపతి స్టేషన్‌లో భక్తులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరముంది.

జూలై 19 నుంచి హనుమ అవార్డ్సు రజతోత్సవం

తిరుపతి(జీవకోన), జూన్ 4(ఆంధ్రజ్యోతి): టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో జూలై 19 నుంచి 27వ తేదీ వరకు అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్సు రజతోత్సవం మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు బీఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ వేడుకలకు పోటీదారుల నుంచి 32 పద్య నాటకాలు, 53 సాంఘిక నాటికలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో ఎనిమిది పద్య నాటకాలు, 10 సాంఘిక నాటికలు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. విజేతలకు నగదు బహుమతితో పాటు హనుమ అవార్డ్సు అందజేయనున్నట్లు తెలిపారు. రోజూ 10 గంటల నుంచి కూచిపూడి, భరతనాట్యం, జానపద బృంద నృత్య పోటీలతో పాటు సోలో నృత్యాలు కూడా ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు 9581154667ను సంప్రదించాలన్నారు.

ఆర్టీసీలో సిబ్బంది కొరత సమస్యను పరిష్కరిస్తాం

● ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి



వెంకటగిరి ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఎదుర్కొంటున్న సిబ్బంది కొరతను త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ డిపోలో నెలలో ఒక రోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అధికారులు, కార్మికులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అధికారులు, కార్మికులు మొక్కల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. గూడూరు -వెంకటగిరి రోడ్డు నిర్మాణం పనులు సీఎం దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే రూపకల్పన చేస్తామన్నారు. మూతబడిన డక్కిలి బస్టాండు, అభివృద్ధికి నోచుకోని బాలాయపల్లి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని వివరించారు. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టీటీ మణి, గోపాల్‌నాయుడు, కోటేశ్వరరావు, మేక రమ్యశ్రీరవి, భాస్కర్, దశరథరెడ్డి, డీఎం రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నెల రోజులుగా అనుమానాస్పదంగా..!



శ్రీకాళహస్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దక్షిణకైలాసనగర్ కాలనీలో 40రోజులుగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం తిష్ఠ వేసింది. పట్టణంలోని దక్షిణకైలాస్ నగర్ కాలనీలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యావంతులు అధికంగా నివసిస్తుంటారు. పోలీసు అధికారులు కూడా పలువురు ఇక్కడే నివాసం ఏర్పరచుకున్నారు. అయితే ఈ ప్రాంతంలో చోరీలు అధికంగా జరుగుతూ ఉంటాయి. కాలనీలో శ్రీవారి లేఅవుట్‌లో 9వ క్రాస్ రోడ్డులో ఓ ద్విచక్ర వాహనం సుమారు 40రోజుల నుంచి అక్కడే ఉంది. అనుమానాస్పదంగా వాహనం అక్కడ ఉండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

ఘనంగా గురవారెడ్డి జన్మదిన వేడుకలు



ఏర్పేడులో కేక్ కట్ చేస్తున్న గురవారెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, దశరథాచారి, నాయకులు మిన్నల రవి, కామేష్ యాదవ్, మురళినాయుడు, పొన్నారావు, బాలాజీరెడ్డి, మునిరాజాయాదవ్, ఈ శ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని అంబలి స్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి జన్మదిన వేడుకలను ఏర్పేడులో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి ఘనంగా జరిపారు. అన్నదానం చేశారు. ధనంజయులునాయుడు, నాగరాజనాయుడు, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, మురుగన్, సుధాకర్‌రెడ్డి, అర్జున్ బాబు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు సారె సమర్పణ





అమ్మవారి ఊరేగింపులో బొజ్జల బృందమ్మ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో కొలువై ఉన్న బంగారమ్మ ఆలయంలో జాతరను పురస్కరించుకుని బుధవారం ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ సారెను అందజేశారు. పూజల అనంతరం బంగారమ్మను పట్టువస్త్రాలతో విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్య నాయుడు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు కుంభం వేశారు. 6గంటలకు బంగారమ్మ ఉత్సవమూర్తిని పట్టణంలో ఊరేగించి రాత్రి నిమజ్జనం చేశారు. కాగా ఈ ఊరేగింపులో ఎమ్మెల్యే సుధీర్ పాల్గొన్నారు.

అదుపు తప్పి బస్సును ఢీకొన్న స్కూటర్

● ముగ్గురికి గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు విజయగోపాలపురం దగ్గర అదుపు తప్పిన స్కూటర్ ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు... కాటూరుకు చెందిన ఆకాష్, విష్ణు, చందు బుధవారం బీఎన్‌కండ్రిగ నుంచి కాటూరుకు స్కూటర్‌లో వెళ్తున్నారు. విజయగోపాలపురం వద్ద రోడ్డు పక్కన పైపులైను పనులు జరుగుతుండడం, ఎక్స్‌కవేటర్, క్రేన్ ఉండటంతో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గుర్తించకుండా అదుపు తప్పి ఢీకొన్నారు. ఈ ఘటనలో ఆకాష్, చందుకు తీవ్రంగా గాయాలయ్యాయి. విష్ణుకు మాత్రం స్వల్ప గాయమైంది. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై శిక్షణ

రేణిగుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సహాయకులకు పీఎం పోషణ, ఎండీఎంపై రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని 65 పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన సహాయకులకు పోషకాహార ప్రాథమిక విషయాలు, మెరుగైన ఆరోగ్య కోసం బలవర్ధక ఆహారంపై పీవో అరుణ, అసోసియేట్ కృష్ణవేణి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రంగనాథయ్య, హెచ్ఎం శంకరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

శ్రీకాళహస్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోరాడి ప్రజలకు న్యాయం చేద్దామని డీసీసీ అధ్యక్షుడు బాలుగురవం బాబు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిద్దామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త టి.దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కరీముల్లా, సురేంద్రరెడ్డి, రాహుల్‌రాయల్, నవీన్, ఆంటోని, కరీముల్లా, పఠాన్, అల్తాఫ్, బబ్లు తదితరులు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడిని శ్రీకాళహస్తీశ్వరాలయ స్వచ్ఛంద సేవకులు కలిసి తమ పోరాటానికి మద్దతు పలకాలని కోరారు.

పుత్తూరు వార్తలు

ముందుకు సాగని మురుగు

● పొంచి ఉన్న వానాకాలం ముప్పు



కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు

పుత్తూరు అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే పుత్తూరు పట్టణ ప్రజలను వ్యాధుల భయం వెన్నాడుతుంది. మురుగునీటి నిల్వలు, కలుషిత నీటి సరఫరా, పారిశుధ్య సమస్యలు తలెత్తడం, అంటువ్యాధులు, డయేరియాలతో ముప్పు పరిపాటిగా మారుతోంది. మందు వేసవిలోనే ఆరేటమ్మ గుడి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు చికున్ గున్యా బారిన పడ్డారు. ఇటీవల జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో సమస్యపై సంబంధిత అధికారులను మందలించారు.

చర్యలు నామమాత్రం

స్వయంగా జిల్లా కలెక్టర్ స్పందించి మురుగునీటి వ్యవస్థను మెరుగు పరచాలని సూచించినా మున్సిపల్ అధికారుల్లో చలనం లేకుంది. ఆరేటమ్మ గుడి వద్ద మురుగునీరు ప్రవహించేందుకు చర్యలు చేపట్టలేదు. పట్టణంలో మురుగునీటి కాలువలు 53 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. జెండామాన్ ఎక్స్‌టెన్షన్, పద్మావతిపురం, ఎన్టీఆర్ కాలనీ ఎక్స్‌టెన్షన్ తదితర ప్రాంతాల్లో ఉన్న మట్టి కాలువల్లో మురుగు, సిల్ట్ తొలగించాల్సి ఉంది.

ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవ ఆహ్వానం



భానుప్రకాష్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న అధికారులు

వడమాలపేట, జూన్ 4(ఆంధ్ర జ్యోతి): మండలంలోని అప్పలాయగుంట కల్యాణ వెంకన్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు టీటీడీ అధికారులు ఆహ్వానం పలికారు. అప్పలాయగుంటలో ఈనెల 7నుంచి 15 వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా తిరుపతిలోని ఆయన నివాసంలో బుధవారం ఆహ్వాన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అప్పలాయగుంట ఆలయంలో భక్తులకు మెరుగైన సేవలందించేలా టీటీడీ ఉన్నత అధికారులకు విన్నవిస్తానని చెప్పారు. డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, కంకణభట్టార్ తిప్పయ్యాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

స్వచ్ఛంద సేవకులకు ఆహ్వానం

శ్రీకాళహస్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామిఅమ్మవార్లకు, ఇతర ప్రదేశాల్లో స్వచ్ఛందంగా సేవలందించేందుకు ఆసక్తి గల భక్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి పేర్కొన్నారు. 20 నుంచి 55 సంవత్సరాల్లోపు వారు ఆలయ పరిపాలన భవనంలోని శివసేవకుల కేంద్రంలో కానీ, నెం.7981547620లో సంప్రదించాలన్నారు.

అరాచక పాలన అంతరించిన రోజు

టీడీపీ శ్రేణుల సంబరాలు ● కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే సుధీర్



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో వైసీపీ అరాచకపాలన అంతరించిన రోజుగా జూన్ 4వ తేదీ నిలిచిపోతుందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గత యేడాది ఎన్నికల ఫలితాలు వెలువడి వైసీపీ ఘోర ఓటమి చెందిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం అరాచకపాలన అంతరించిన దినంగా టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయం వరకు టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ మాట్లాడుతూ... గత యేడాది జూన్ 4న వైసీపీ భూతాన్ని ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు తరిమికొట్టారని గుర్తు చేశారు. ప్రజా తీర్పును అవహేళన చేస్తూ మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు వెన్నుపోటు దినంగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. వైఎస్ కుటుంబానికి రాజకీయంగా ఎంతో లబ్ధి చేకూర్చిన కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన మొదటి వ్యక్తి జగన్ అన్నారు. తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని పదవుల కోసం రాజకీయాలు చేసిన హేయమైన వ్యక్తిత్వం ఆయనదన్నారు. సరిగ్గా ఎన్నికల ముందు సొంత బాబాయిని గొడ్డలిపోటు పొడిచిన వ్యక్తి జగన్ అని ఆరోపించారు. యేడాది నుంచి రాష్ట్రంతో పాటు ఇటు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో సుభిక్షంగా ఉన్నారని చెప్పారు. అభివృద్ధికి ప్రతిరూపమైన సీఎం చంద్రబాబు 75ఏళ్ల వయసులో కూడా లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్ర అభివృద్ధికోసం రోజుకు 18గంటల పాటు శ్రమిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక, విద్య, వ్యాపార, వ్యవసాయ రంగాల అభివృద్ధితో పాటు ముక్కంటి ఆలయ ప్రక్షాళనతో ప్రజలకు సుస్థిరమైన పాలన చేరువ చేస్తున్నామన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు ధనంజయులు నాయుడు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మండలంలోని పాపానాయుడుపేటలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు నాగరాజునాయుడు, రోశయ్య, అర్జున్‌బాబు, కిష్టప్ప మొదలియార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): పట్టణలో బుధవారం సాయంత్రం టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. మునిచంద్రనాయుడు, రవినాయుడు, కార్తీక్ నాయుడు, రామనాథం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలు వైసీపీవే

జడ్పీటీసీ సుమన్‌కుమార్


నారాయణవనం, జూన్ 4(ఆంధ్రజ్యోతి):వెన్నుపోటు రాజీకీయాలకు, దౌర్జన్యాలకు, అక్రమాలకు కేంద్రబిందువు వైసీపీ అని నారాయణవనం జడ్పీటీసీ సుమన్‌కుమార్ విమర్శించారు బుధవారం ఆయన వెన్నుపోటు రోజు అంటూ వైసీపీ చేస్తున్న కార్యక్రమంపై విరుచకపడ్డారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం దౌర్జన్యాలకు, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్సుగా ఉండేదని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమ పథకాలతో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్నదని గుర్తు చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి పథకాల హామీలను నెరువేరుస్తుండడాన్ని చూసి ఓర్వలేని వైసీపీ ఇలా వెన్నుపోటు అంటూ ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నదన్నారు. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే సామాజిక భద్రతా పెన్షన్లు పెంచడం, బకాయిలు చెల్లించడం వైసీపీ నాయకులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. దీపం పథకం ద్వారా రాయితీపై గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని చెప్పారు.

వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ జగన్

సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ జగన్ అని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన నేపథ్యంలో సత్యవేడులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీపై ఆయన విరుచుకు పడ్డారు. ఈ సందర్భంగా శ్రీపతిబాబు మాట్లాడుతూ సైకో నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుని టీడీపీ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వైసీపీ డ్రామాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. కుంభకోణాలు బయటపడతాయనే భయంతో ధర్నాల పేరుతో ప్రజల్ని మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటుపొడవడమే కాకుండా తండ్రి వైఎస్, చిన్నాన్న వివేకానంద రెడ్డి ఆత్మలకు సైతం వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దే అన్నారు. కన్న తల్లిని, చెల్లిని బయటకు గెంటేసి కుటుంబ వ్యవస్థకు వెన్నుపోటు పొడిచారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో నెంబర్ వన్ వెన్నుపోటుదారుడు జగన్ అని అన్నారు. సమావేశంలో పరమశివం, షణ్ముగం, కృష్ణ చైతన్య, శివానందం, రవి, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట సమీపంలో బీఎస్ఎన్ఎల్ టవర్ దగ్గర మంగళవారం ఆటో ఢీకొని కూలీన విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌కో అధికారులు బుధవారం మార్చారు. స్తంభం కూలడంతో మూడు విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపోవడంతో నీర్పాకోటలో అంధకారం నెలకొంది. ఎట్టకేటలకు అధికారులు మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో తదితరులు

కేవీబీపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాజు కండ్రిగలో అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించే దిశగా వెయ్యి మొక్కల ను నాటనున్నారు. ఎంపీడీవో మాలతి, ఇన్‌చార్జి తహసీల్దారు మధుసూదన్, ఆర్ఐ కరుణాకర్, రెవెన్యూ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ ఏవోగా త్రివిక్రమరావు

సత్యవేడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎంపీడీవో కార్యాలయ ఏవోగా త్రివిక్రమరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చినాయుడుకండ్రిగ ఎంపీడీవో కార్యాలయం ఏవోగా పని చేస్తున్న త్రివిక్రమరావును సాధారణ బదిలీలలో భాగంగా ప్రభుత్వం సత్యవేడుకు బదిలీ చేసింది.

రైతు సంక్షేమమే చంద్రన్న ప్రభుత్వ ధ్యేయం



యంత్ర పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. బుధవారం ముడియూరులో రాస్ కేవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరలో రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందించనుందన్నారు. సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందిస్తూ వారి అవసరాలను ఎప్పటికప్పుడు తీర్చే విధంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అలాగే వ్యవసాయ అధికారులు, సహాయకులతో పాటు రాస్ కేవీకే సంస్థ ఎప్పటిప్పుడు రైతులతో మమేకమై సాగులో సలహాలు, సూచనలు ఎ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. తదుపరి రైతులకు పవర్ టిలర్ యంత్రాన్ని రైతులకు ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయడాన్ని వ్యవసాయ అధికారులు వివరించారు.

● తులసిక్కష్టాపురంలో మంచానికే పరిమితమై పి.సురేష్‌ని ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించారు. సురేష్ రెండు కాళ్లు, చేతులు చచ్చుబడి మంచానికే పరిమితం కావడం వల్ల ప్రభుత్వం నుంచి రూ.15 వేలు పింఛన్ వచ్చేందుకు చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందిని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, మునిశేఖర్ రెడ్డి, ఏవో సంజీవరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, సుమంత్, అనూష, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇది వెన్నుపోటు ప్రభుత్వం





శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం పట్టణాల్లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అధికారం కోసం కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు పలు హామీలను ఇచ్చిందని... ఇప్పటి వరకు వాటిని అమలు చేయకపోవడంతో నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు వెన్నుపోటు పొడవడమే అని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయం వద్ద వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం చేరుకుని నిరసన చేపట్టారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ శ్రీనివాసులు, వి.కృష్ణారెడ్డి, గిరిధర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కిషోర్‌రెడ్డి, రమణయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ అమలు చేస్తామని ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరదయ్యపాళెంలో నిరసన చేపట్టారు. మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపది కల్యాణోత్సవం



ఏర్పేడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలం పాతవీరాపురంలో శ్రీకృష్ణ, ద్రౌపది, ధర్మరాజ స్వామి ఆలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం కల్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామిఅమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయానికి విరాళం

ఏర్పేడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ మహా కుంభాబిషేకం సందర్భంగా పాపానాయుడు పేట సర్పంచ్ లలిత బుధవారం రూ.55వేలు అందించారు. ఎస్ఎస్ చంద్ర, తంబా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జికి సన్మానం



రేణిగుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి అమాస రాజశేఖర్‌రెడ్డిని రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు. బుధవారం చిత్తూరు నగరంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాదము నిరెడ్డి, మల్లాం భాస్కర్‌రెడ్డి, మోహన్‌రావు, జంగారెడ్డి, రజిని, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కుక్కంబాకం లోని సర్వే నెం.81లోని ప్రభుత్వ భూముల్లో ప్రవేశించరాదంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ.. సదరు భూమాని ఆక్రమించి సాగు చేస్తున్నారని సమాచారం రావడంతో బోర్డు ఏర్పాటు చేశామన్నారు.